www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 13 మే 2025

5

కాకినాడ

ఇండోనేషియాలో ఆదిత్య ప్రొఫెసర్ ప్రసంగం

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తెలుగు నీలిమ ఇటీవల ఇండోనేషియాలోని యోగ్యకర్తలో నిర్వహించిన త్రిసక్టి ఇంటర్నేషనల్ స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లో గౌరవ అతిథిగా పాల్గొన్నారు. 'ఇండోనేసియన్ కల్చరల్ ఇన్‌సైట్స్: ఎక్స్‌ప్లోరింగ్ యోగ్యకర్తాస్ హెరిటేజ్' అనే అంశంపై రెండు వారాల పాటు నిర్వహించిన ఇండోనేషియా సాంస్కృతిక వైవిధ్యం అనుభవించే అవకాశాన్ని కల్పించింది.డాక్టర్ నీలిమ 'నాన్-వర్బల్ కమ్యూనికేషన్ : ఎ గ్లోబల్ మైన్‌ఫీల్డ్' అనే అంశంపై ఉపన్యాసం నిర్వహించారు. ఆమెను ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి, డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ఎంబి.శ్రీనివాస్, డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఎ.రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్ అభినందించారు.

భారీగా ఫీజుల దోపిడీ

- మరోసారి పెంచిన కార్పొరేట్ స్కూళ్లు
- పుస్తకాలు, యూనిఫారాల ధరల పెంపు
- ఆందోళనలో తల్లిదండ్రులు
- కొరవడిన అధికారుల నియంత్రణ

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పలు ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు భారీగా దోపిడీకి పాల్పడుతున్నాయి. ఫీజులు, డొనేషన్ల పేరుతో తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి మరీ సొమ్ములు వసూలు చేస్తున్నాయి. నియంత్రణ లేని ఫీజుల వసూళ్లపై అధికారులు కనీసంగానైనా పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఈ ఏడాది జూన్ 12 నుంచి విద్యా సంస్థలు పున్ర ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో 10 నుంచి 30 శాతం ఫీజులను పెంచి వసూలు చేసేందుకు ఇప్పటికే తల్లిదండ్రులకు నోటీసులు ఇచ్చాయి.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 1800 వరకూ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 3 లక్షల 50 వేల మంది ఏటా చదువుతున్నారు. పలు విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండానే ఆయా యజమాన్యాలు పబ్బం గడుపుతున్నాయి. విద్యా ప్రమాణాలకు నీళ్లు వదులుతూ అతిక్రమిస్తున్నాయి. సరైన వసతులు కల్పించకుండానే నడుపుతున్నారు. కనీసం అగ్నిమాపక శాఖ నిబంధనల ప్రకారం సేఫ్టీ ప్రమాణాలను పక్కన పెడుతున్నాయి. పరిమితికి మించి విద్యార్థులను తరగతి గదుల్లో ఉంచుతున్నారు. కనీస విద్యార్హతలు లేని ఉపాధ్యాయులతోనే బోధన సాగిస్తున్నారు. అనేక పాఠశాలలకు ఆట స్థలం కూడా లేని దుస్థితి నెలకొంది. బస్సుల్లో విద్యార్థులను కుక్కి మరీ నడిపిస్తున్నారు. దూరంతో సంబంధం లేకుండానే రవాణా ఛార్జీలను భారీగా వసూలు చేస్తున్నారు. ఇలా అనేక నిబంధనలను తుంగలోకి తొక్కి వ్యవహరిస్తున్న పరిస్థితి ఉంది.



దారుణంగా ఫీజులు పెంచి వసూలు

ప్రతి సంవత్సరం భారీగా ఫీజులు పెంచుతూ వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నాం. కనీసంగానైనా చర్యలు తీసుకోవడం లేదు. పేద, మధ్యతరగతి వర్గాలకు చదువు భారంగా మారుతోంది. ఇప్పటికైనా ప్రైవేటు యజమాన్యాల ఫీజులు వసూళ్లను తగ్గించాలి. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి. వసతులను మెరుగు పర్చాలి.

- ఎం.గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.

భారీగా పెంచుతున్న ఫీజులు

తమ పాఠశాలల్లో చేర్పించండి అంటూ పదే పదే ఇళ్లకు తిరిగిన యాజమాన్యాలు తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి తొలుత మగ్గులోకి దింపుతున్నాయి. ఆ తర్వాత భారీగా ఫీజులు పెంచి వసూలు చేస్తున్నాయి. వాస్తవానికి ప్రభుత్వం కొన్ని ఫీజులను నిర్దేశించింది. వాటికి నాలుగు నుంచి ఐదు రెట్లు పెంచి వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. తల్లిదండ్రులను అయోమయంలోకి నెడుతూ పిల్లల చదువుల బలహీనతలను ఆసరాగా చేసుకుంటూ ఫీజులు దండుతున్నాయి. ప్రతి సంవత్సరం రూ.10 వేల నుంచి రూ.20 వేలు పెంచి వసూలు చేస్తున్నారు. డొనేషన్ల పేరుతో తల్లిదండ్రులను దోచేస్తున్నారు. కాకినాడ, రాజమహేంద్రవరంలో ఉన్న కొన్ని యాజమాన్యాల ఇష్టారాజ్యానికి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ప్రైవేటు స్కూళ్లు అయితే రూ.30 వేల నుంచి రూ.60 వేలు, కార్పొరేట్ స్కూళ్లు రూ.లక్షల్లో దోచుకుంటున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు

యూనిఫారం, బూట్లు, టై, పుస్తకాల పేరుతోనూ దోపిడీ సాగుతోంది. పుస్తకాలకు రూ.5 వేలు నుంచి రూ.12 వేల వరకు వసూలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం వీటిని విద్యాసంస్థల్లో విక్రయాలు జరపకూడదు. పైగా బహిరంగ మార్కెట్లో దొరికే వాటి కన్నా పది రెట్లు వసూలు చేస్తుండడం విస్మయకరమని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఫిర్యాదులు ఇస్తున్నా విద్యాశాఖ అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొరవడిన నియంత్రణ

తమకు నచ్చిన రీతిలో ఫీజులను వసూలు చేస్తున్నా సరైన నియంత్రణ లేకపోవడంతో తల్లిదండ్రుల జేబులు గుల్లవుతున్నాయి. మరోవైపున పలు నిబంధనలను ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు తుంగలోకి తొక్కుతున్నాయి. పదో తరగతి, ఇంటర్ చదివిన వారితో తక్కువ జీతాలు ఇచ్చి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బిఇడి, డైట్‌సెట్ చేసిన శిక్షణ పొందిన వారితో విద్యనందించాలనే నిబంధన ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీనిపై విద్యా శాఖతో బాటు జిల్లా కలెక్టర్ నియంత్రణ గనుక ఉంటే ఫీజుల భారం తగ్గే అవకాశం ఉంటుందని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.

అర్జీలను నాణ్యతతో సకాలంలో పరిష్కరించాలి

ప్రజాశక్తి-కాకినాడ

వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన వినతులను నాణ్యతతో అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, జెడ్‌పి సిఇఒ వివి.లక్ష్మణరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వివి. సత్యనారాయణ, సిపిఒ త్రినాథ్, ఇతర అధికారులతో కలిసి హాజరై, కాకినాడ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు, అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, రీ సర్వే, ఆక్రమణల తొలగింపు, మత్స్యకార భరోసా, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం వంటి అంశాలకు చెందిన మొత్తం 373 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను పరిష్కరించేటప్పుడు అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి మాత్రమే ఎండార్స్‌మెంట్ చేయాలని సూచించారు. సక్రమంగా పరిష్కరించని వాటిని రెండు స్థాయిల్లో ఆడిట్ జరిపి మరల రీ ఓపెన్ చేస్తారని అలా ఎక్కువ దరఖాస్తులు రీ ఓపెన్ చేసిన శాఖ అధికారులకు మెమోలు జారీ చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు.

కుల నిర్మూలనే కెవిపిఎస్ లక్ష్యం : మల్యాద్రి

ప్రజాశక్తి -రౌతులపూడి

కార్యక్రమంలో పాల్గొన్న కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

కుల నిర్మూలన కెవిపిఎస్ లక్ష్యం అని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మల్యాద్రి అన్నారు. సోమవారం కెవిపిఎస్, ఉద్యోగ సంఘాలు, దళిత సంఘాలు ప్రజాస్వామ్యవాదులు తదితరుల ఆధ్వర్యంలో సంగం, శరణం, గచ్చామి అనే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రపై నాటక ప్రదర్శనలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా కెవిపిఎస్ ఏప్రిల్ 22న రాష్ట్రంలోని కర్నూలులో పెదకూరపాడులో ఈ కళా ప్రదర్శనను ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రదర్శలు నిర్వహించినట్లు తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను ప్రజలు తెలుసుకొని చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్, కెఎస్.శ్రీనివాస్, సింహాచలం, ఎంపిపి గంటిమల్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపిపి భాస్కర్ బాబు, ఎస్ఐ వెంకటేశ్వరరావు, సర్పంచ్ రాపర్తి రామకృష్ణ, నాయకులు, జిగిరెడ్డి శ్రీను, బర్రే రాజేశ్వరరావు, కొంకిపూడి రాజ్యలక్ష్మి, తాతబాబు ఎస్ఎఫ్ఐ నాయకులు గంగా సూరిబాబు, వరహాలు టిడిపి నాయకుడు పైల వేణు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 6వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరంలో కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, తమ వేతనాలు పెంచాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు సుంకర నాగేశ్వరరావు, కెవి.రమణ, బి.భద్రరావు, జి.సతీష్, జి.నాగేశ్వరరావు, వి.భాస్కర్, ఎస్.సత్తిరాజు, డి.రాజు, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ఇంజనీరింగ్ కార్మికులు

మురళీ నాయక్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

జవాన్‌ల మహోన్నత త్యాగం

ప్రజాశక్తి - పెద్దాపురం

దేశం కోసం ప్రాణాలర్పించడం వీర జవాన్ల మహోన్నత త్యాగానికి నిదర్శనమని ఎస్ఐ వి.మౌనిక అన్నారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో విద్యార్థులకు 30 రోజులపాటు గుడ్డు, అంబలి పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. తొలత పాకిస్తాన్ కాల్పుల్లో వీరమరణం పొందిన మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మనమంతా ప్రశాంతంగా ఉండేందుకు నిరంతరం శ్రమిస్తున్న జవాన్ల త్యాగాలను మనం గుర్తించుకోవాలన్నారు. చిన్ననాటి నుండి క్రమశిక్షణ, దేశభక్తి అలవర్చుకోవాలన్నారు. పిసిసి గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్ మాట్లాడుతూ మిషన్ అన్నపూర్ణ సహాయనిది వ్యవస్థాపకులు దేవత రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో వెలగా త్రిపుర, సుధీర్ 30 రోజులపాటు విద్యార్థులకు గుడ్లు, అంబలి ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో దేవత రాజేష్ కుమార్, కరాటే శిక్షకులు తెప్పల యోగిస్, వ్యాయామ శిక్షకులు లోకేష్, పిసిసి కార్యదర్శి రొంగల అరుణ్ కుమార్, కూనిరెడ్డి రవికుమార్, అమృత, నమ్రత, సాయి, మణికంఠ, పవన్ కుమార్, హర్ష, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వాసుపత్రి సేవలు

ప్రజాశక్తి-కాజులూరు

భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సుభాష్

కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం కాజులూరు మండలం దుగ్గుదుర్రు పిహెచ్‌సిలో రూ.33.50 లక్షలతో నిర్మించనున్న వైరాలజీ ల్యాబ్ భవన నిర్మాణానికి సోమవారం ఆయన భూమి పూజ చేశారు. అనంతరం మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు, వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం తొలి దశలో 168 బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్స్ మంజూరు చేసిందన్నారు. ఆ యూనిట్స్ నెలకొల్పడం ద్వారా గతం కంటే మెరుగ్గా అన్ని రకాల వైద్య, రక్త పరీక్షలు 24 గంటల్లోపు అందుతాయన్నారు. కరోనా సమయంలో కొన్ని పరీక్షలు చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఈ వైరాలజీ ల్యాబ్ ద్వారా సత్వర సేవలు, సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వైద్య రంగానికి కూటమి ప్రభుత్వం తగినన్ని నిధులు మంజూరు చేసిందన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ సేవలను వినియోగించుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని మంత్రి సుభాష్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిఎంహెచ్ఒ ఆర్.రమేష్, ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వై.సుప్రియ, డాక్టర్ జి.స్వాతి, ఎపిపి మాత భారతి, ఎంపిడిఒ జె.రాంబాబు, మాజీ ఎంపిపి యాళ్ల కృష్ణారావు, మాజీ సహకార సంఘం అధ్యక్షుడు కొప్పిశెట్టి స్వామినాయుడు సిరిపురం డిసి పేపకాయల నారాయణరావు, వనుం వీరబ్రహ్మం, పంపన తాతబ్బాయి, సర్పంచులు పోతు వెంకటలక్ష్మి జ్యోతి కుమార్, భూపతిరాజు సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

విద్యా శాఖలో సమస్యలపై యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

విద్యాశాఖలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద యుటిఎఫ్ కాకినాడ జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షుడు వివి.రమణ అధ్యక్షతన సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ పథకం అసోసియేట్ అధ్యక్షుడు ఐ.ప్రసాదరావు మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో భాగంగానే ప్రభుత్వ పాఠశాలలో తిరోగమన విధానాలు అమలులోకి వస్తున్నాయని తెలిపారు. పాఠశాలల రేషనలైజేషన్, ఉపాధ్యాయ పోస్టులు తరచూ రేషనలైజేషన్ జరగడానికి ప్రధాన కారణం విద్యా రంగాన్ని ప్రైవేటీకరణ చేయడమేనని తెలిపారు. ముఖ్యంగా మన రాష్ట్రంలో కేవలం ఇంగ్లీష్ మీడియం కొనసాగించడంతో అనేక పాఠశాలల్లో నమోదు తగ్గి, ఉపాధ్యాయ పోస్టులు, పాఠశాలలు రేషనలైజేషన్ (కుదింపు) జరుగుతోందన్నారు. రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన 117 జిఒ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ పేరుతో గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను మూసి వేయడం తగదన్నారు. టీచర్స్ బదిలీలు, ప్రమోషన్లో మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని, ఖాళీగా ఉన్న అన్ని పోస్టులు ప్రదర్శించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్ కోరారు. అనంతరం డిఇఒ పిల్లి రమేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సీతారామరాజు, గోవిందరాజులు, నాగరాజు, సీతారామయ్య, గిరిధర గోపాలరావు, రాజబాబు, శ్రీనివాస్, నాగమణి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని వినతి

ప్రజాశక్తి-కాజులూరు

ధాన్యం మద్దతు ధరకే కొనుగోలు చేయాలని ఎపి కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ జిల్లాలో 80 శాతం ధాన్యం మాసూలు అయ్యిందని, 40 శాతం మాత్రమే మిల్లులకు చేరిందని తెలిపారు. మిగతా ధాన్యం పొలం గట్లపై ఉందని, ఈ ధాన్యం రైతు సేవా కేంద్రాల ద్వారా తొందరగా కొనుగోలు చేయడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు అడపా ఆదినారాయణ, గుత్తుల నాగరాజు, వనుం వీరబ్రహ్మం, జోడ బ్రహ్మాజీ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



20న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

ఈ నెల 20న దేశవ్యాప్తంగా కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలని సోమవారం పలుచోట్ల సన్నాహక సమావేశాలు నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ జిజిహెచ్ మెస్ వర్కర్స్ యూనియన్ సమావేశం అధ్యక్షుడు వై.శంకర్ అధ్యక్షతన నిర్వహించారు. నాయకులు అనపర్తి ఏడుకొండలు, సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ మాట్లాడారు. యూనియన్ నాయకులు వీరబాబు, వై.శ్రీను, రాజశేఖర్, శ్రీను, కృష్ణ, దుర్గమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు వ్యవసాయ కార్మిక సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు ఉపాధి వేతనదారులు, మేట్స్, ఫీల్డ్ అసిస్టెంట్స్, ఆఫీస్ అటెండర్స్‌ను కలిసి సమ్మెను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

యు.కొత్తపల్లి ప్రభుత్వాలు కోడ్లు ఏర్పాటు చేసి కార్మిక హక్కులను కాల రాస్తున్నారని సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీ రాణి అన్నారు. స్థానిక అచ్చియమ్మ కల్యాణ మండపంలో సిఐటియు నాయకులు కె.నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు ఇచ్చారు. రైతు సంఘం నాయకులు జి.అప్పారెడ్డి, సిఐటియు నాయకులు కెవివి.సత్యనారాయణ, కె.నాగేశ్వరరావు, వి.సత్యనారాయణ, జివి.సుబ్బిరెడ్డి, వి.గంగాధర్‌రావు, ఎం.లక్ష్మి, సత్యవతి, సిహెచ్.చిన్ని, ఎ.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

యు.కొత్తపల్లిలో మాట్లాడుతున్న సిఐటియు నేత బేబీరాణి

తాళ్లరేవులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఈశ్వరరావు

కాకినాడలో మెస్ వర్కర్స్‌తో మాట్లాడుతున్న సిఐయుటి నేతలు

ఇంగ్లీష్ వ్యాకరణంపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం విద్యార్థులకు ఇంగ్లీష్ వ్యాకరణంపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కథలు చదివించి వారితో కథలు చెప్పించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు మాట్లాడుతూ పుస్తకాలు చదవటం వల్ల కలిగే ఉపయోగాలు, నీతి పద్యాలు, నీతి కథలు చదవడం ద్వారా పెంపొందే మానవతా విలువలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బుల్లయ్య, కొమ్మన అప్పారావు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ఘన సత్కారం

ప్రజాశక్తి - సామర్లకోట

పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సోమవారం శ్రీశారదా రామకష్ణ సేవా సమితి ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. సమితి 66వ వార్షికోత్సవ వేడుకలు పెదబ్రహ్మదేవంలో గౌరవాధ్యక్షులు వింజమూరి సుబ్రహ్మణ్య శర్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి పరిజ్ఞానంద మహారాజ్ పాల్గొని మాట్లాడారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ, ఇంద్రకంటి సత్యనారాయణ, వింజమూరి విశ్వనాథ్, నువ్వుల వెంకట్రాజు, టివివి.సత్యనారాయణ, నువ్వుల బాబ్జి, ఎ.సత్యనారాయణ నరసింహారావు, చందవోలు సత్యనారాయణ, నువ్వుల సూర్య చంద్రరావు, మండవిల్లి వెంకట్రావు, తోటకూర నాగమణి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

నగర పంచాయతీ పరిధిలో మార్కెట్ ఏరియాలో రోడ్డు వేయాలని, డ్రైనేజీ మెరుగు పరచాలని కోరుతూ సిపిఎం నాయకుడు కె.చిన్న సోమవారం పాడా కార్యాలయంలో పీడీ చైత్ర వర్షిణికి వినతిపత్రం అందించారు. పట్టణంలోని మార్కెట్‌లో వర్షం వస్తే రోడ్డంతా బురదమయం అవుతోందని, గుంతలుగా మారి ప్రజలు కొనుగోలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సూర్యుడు చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఓరిగంటి నందీశ్వరుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

13న డిఎస్‌సిపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 13న మధ్నాహ్నం 2 గంటలకు స్థానిక సూర్య కళామందర్‌లో డిఎస్‌సిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్, అసోసియేట్ అధ్యక్షుడు ఐ.ప్రసాదరావు తెలిపారు. ఈ సదస్సులో ముఖ్య వక్తగా మాజీ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు హాజరై వివిధ సబ్జెక్టుపై మెళుకువలు, అవగాహన కల్పిస్తారని తెలిపారు. హాజరైన అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తారని తెలిపారు. ఈ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు సదస్సుకు హాజరై వినియోగించుకోవాలని సూచించారు.

రేషన్ కార్డులకు 163 దరఖాస్తులు

ప్రజాశక్తి-పెద్దాపురం

మండల పరిధిలో సోమవారం వరకు రేషన్ కార్డులకు సంబంధించి 163 దరఖాస్తులు అందాయని తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని సచివాలయాలలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు, రేషన్ కార్డులలో చేర్పులు, మార్పుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారన్నారు. రేషన్ కార్డులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇప్పటివరకు కొత్త రేషన్ కార్డులకు సంబంధించి 27, రేషన్ కార్డులో పేర్లు తొలగింపుకు సంబంధించి 109, అడ్రస్ మార్పుకు సంబంధించి 1, కొత్త పేర్లు నమోదుకు 17, ఇతర సవరణలకు సంబంధించి 8 దరఖాస్తులు వచ్చాయన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -సామర్లకోట

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఎగిసిపడుతున్న రక్షిత జలాలు అను శీర్షికతో ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు విద్యుత్ పంచాయతీ అధికారులు స్పందించారు. సోమవారం సామర్లకోట ట్రాన్స్‌కో అధికారులు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పైప్‌లైన్ లీకుల కారణంగా వెదజల్లుతున్న నీటిని ఆపుతూ మరమ్మతులు చేపట్టారు. పాత పైపులు తొలగించి కొత్త పైపును ఏర్పాటు చేసి నీరు లీక్ అవకుండా సరి చేశారు.

నేరాలు ఘోరాలు

బస్సు ఢీకొని యువకుని మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

స్థానిక ఏనుగుబాయి తూము వద్ద రామచంద్రపురం నుంచి యానాం వెళుతున్న ఆర్‌టిసి బస్సు ఢీ కొని ఒక యువకుడు దుర్మరణం చెందారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... హసనబాద గ్రామానికి పిల్లి గోపాలకృష్ణ(27)కి గత నెల 22న వివాహమైంది. సోమవారం అంతవారి ఇంటికి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ఏనుగుబాయి తూము వద్ద ఆర్‌టిసి బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు గ్రామానికి చెందిన 17 ఏళ్ల యువతి ఈనెల 10వ తేదీ నుంచి అదృశ్యమైందని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశామని చాగల్లు ఎస్‌ఐ కె.నరేంద్ర తెలిపారు. యువతి వివరాలు తెలిస్తే తమను సంప్రదించాలని కోరారు.

దాడిపై కేసు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

బొబ్బిల్లంకలో డబ్బుల వ్యవహారానికి సంబంధించి జరిగిన దాడిలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం బొబ్బిల్లంక గ్రామానికి చెందిన కోమలి స్వామి, అదే గ్రామానికి చెందిన కోమలి వెంకన్నకు గతంలో కొంత డబ్బు ఇచ్చాడు. స్వామి తన డబ్బులు తిరిగి ఇవ్వమని అడుగగా వెంకన్న తిరస్కరించాడు. ఈ నేపథ్యంలో ఆదివారం వీరిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వెంకన్న ఆగ్రహంతో కూల్ డ్రింక్ సీసాతో స్వామి తలపై కొట్టాడు. ఈ దాడిలో స్వామికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాధితుడిని వైద్యం నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ స్వామి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు ఎస్‌ఐ రామ్‌కుమార్ కేసు నమోదు చేశారు.

10 మందిపై బైండోవర్ కేసు

ప్రజాశక్తి - గోపాలపురం

భీమోలు గ్రామానికి చెందిన పది మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. భీమోలు గ్రామంలో గల సర్వే నంబర్ 322లోని 18 ఎకరాల్లోని జీడిమామిడి, మామిడి తోటలు తమకే చెందుతాయని మారెడ్డి రత్నం, కోడి దేవి వర ప్రసాద్‌లకు చెందిన రెండు గ్రూపులు తరచూ ఘర్షణలకు దిగుతున్నారన్నారు. దీనిపై శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా రెండు గ్రూపులకు చెందిన పది మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఆరు నెలల పాటు బైండోవర్ అమల్లో ఉంటుందనానరు. ఈ పదిమందిలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట శివారు కోదండరామపురం సమీపాన కారు విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొన్న ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదు. పిఠాపురం వైపు నుండి వస్తున్న కారు సామర్లకోట వైపు అతివేగంగా వస్తూ కోదండరామపురం వద్ద రోడ్డు ప్రక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగి కారు ముందు భాగంపై పడింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండటంతో స్థానికులు భయాందోళనలతో పరుగులు తీశారు. స్థానికుల సమాచారంతో విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. కారు నడుపుతున్న వ్యక్తి సూరంపాలెంలోని ప్రముఖ యూనివర్సిటీ ప్రిన్సిపల్ అని సమాచారం.

5,200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సోమవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 5200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ దుర్గార్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో భాగంగా సారా తయారీకి ఉపయోగించే 210 కిలోల నల్లబెల్లపు పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడులకు సంబంధించి ఒకరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఆరుగురుని బాధ్యులుగా నిర్ధారించామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు చిట్టిబాబు, నరసింగరావు, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక రాయల్ పార్క్ హోటల్లో బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. గౌరవాధ్యక్షునిగా చంద్రు గోవింద రాజు, కె.బామిరెడ్డి, ద్వారంపూడి వీరభద్రారెడ్డి, అధ్యక్షునిగా ప్రసాద్ వర్మ, కార్యదర్శిగా ఫణి గోపాల్, కోశాధికారిగా భాస్కరరావు, ఉపాధ్యక్షునిగా ఎం.మురళీధర్, పిఎస్ గణేష్ కుమార్, సహాయ కార్యదర్శులుగా అడ్డాల సత్యనారాయణ, కృష్ణమూర్తి, జగన్నాథ్ ఎన్నికయ్యారు.

నర్సుల సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-పిఠాపురం

వైద్య రంగంలో నర్సులు అందిస్తున్న సేవలు అనన్య సామాన్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కొనియాడారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వాసుపత్రుల్లో పని చేస్తున్న స్టాఫ్ నర్సులతో ఆయన సమావేశం అయ్యారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వాసుపత్రుల్లో ప్రశంసనీయ సేవలందించిన ఎనిమిది మంది స్టాఫ్ నర్సులను సత్కరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ 'విధి నిర్వహణలో ఎంతో మంది రోగుల ప్రాణాలు కాపాడుతున్న నర్సుల సేవలను ఎవరూ మరచిపోరన్నారు. వారు పడే శ్రమ, కష్టం తనకి తెలుసు అన్నారు.

చిన్నారి హత్యలో అమ్మమ్మ, తల్లే నిందితులు

ప్రజాశక్తి-పిఠాపురం

హత్య వివరాలను వెల్లడిస్తున్న సిఐ జి.శ్రీనివాస్

పట్టణంలోని స్థానిక జగ్గయ్య చెరువు కాలనీలో చిన్నారిని హత్య చేసి బావిలో పడేసిన అమానుష ఘటనలో తల్లి, అమ్మమ్మ నిందితులుగా తేలింది. సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సిఐ జి.శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 6న పాప తండ్రి పెదపాటి సతీష్ తన ఐదు నెలల కుమార్తెను హత్య చేసి నూతిలో పడేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాప (యశ్విత) తల్లి పసుపులేటి శైలజ నరసింగపురం గ్రామానికి చెందిన పి.సతీష్ ప్రేమించి ఇరు కుటుంబాలకూ ఇష్టం లేకుండా 2023లో వివాహం చేసుకున్నారు. 2024లో వారికి పాప జన్మించింది. సతీష్‌ను శైలజ వివాహం చేసుకోవడం ఆమె తల్లి పసుపులేటి అన్నవరానికి ఇష్టం లేదు. సతీష్ కూడా తనను సరిగా చూడడం లేదని శైలజ బాధ పడేది. దీంతో యశ్వితను అడ్డు తొలగిస్తే శైలజకు రెండో పెళ్లి చేయవచ్చనే ఉద్దేశంతో తల్లీ కూతుళ్లిద్దరూ 6వ తేదీ అర్ధరాత్రి యశ్వితను ఇద్దరూ గొంతు నులిమి చంపి ఇంటి వెనక నీటి బావిలో పడవేశారు. ఈ హత్యను కప్పిపుచ్చేందుకు ఎవరో క్షుద్ర పూజలు చేసి పాపను చంపేశారని నమ్మించేందుకు ఇంటి ముందు పసుపు, కుంకుమ, నిమ్మకాయలు పెట్టారు. ఈ కేసులో పసుపులేటి అన్నవరం, పెదపాటి శైలజను అరెస్టు చేశామన్నారు. ఈ సమావేశంలో పట్టణ ఎస్‌ఐ మణి కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

బుద్ధుని బోధనలతో సమసమాజం

ప్రజాశక్తి -తాళ్లరేవు

బుద్ధ జయంతిలో పాల్గొన్న నాయకులు

కుల, మత, ఆర్థిక అంతరాలు కలిగిన నేటి సమాజంలో బుద్ధుని బోధనలు సమసమాజానికి దోహదం చేస్తాయని ప్రముఖ వైద్యులు డాక్టర్ జవహర్ అన్నారు. మండలంలోని నీలపల్లి పంచాయతీ సిద్ధార్థ నగర్ బుద్ధ విగ్రహ ప్రాంగణంలో బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం జరిగిన వైశాఖ పౌర్ణమి 2,569వ బుద్ధ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటానికి బుద్ధవందనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ బుద్ధిస్ట్ గుత్తాల శ్రీరాములు అధ్యక్షతన జరిగిన సభలో జవహర్ మాట్లాడారు. బౌద్ధాన్ని ఆచరించే దేశాలు అన్ని రంగాలలోనూ ముందుకు పోతున్నాయని గుర్తు చేశారు. మతం ఇంటికే పరిమితమై, బయటకు వచ్చిన తర్వాత అందరూ భారతీయులుగా మెలగాలని ఆయన సూచించారు. నీలపల్లి గ్రామంలో భూమి దానం చేసే దాతలు ముందుకు వస్తే అందులో సుందరమైన బుద్ధ విహార్ నిర్మాణానికి ఆర్థిక సహకారం అందిస్తానని ఆయన తెలిపారు. డాక్టర్ గుమ్మ వీరన్న తెలుగులో అనువదించిన 'బౌద్ధం మంచి ప్రశ్నలు మంచి జవాబులు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.పెద్దిరాజు, జక్కల ప్రసాద్ బాబు, కె.కరుణ, పి.నాగేంద్ర, జాగృతి,కన్నీడి వెంకటరమణ పాల్గొన్నారు.

పలు సమస్యలపై సిపిఎం ఆందోళన

ప్రజాశక్తి - సామర్లకోట

ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

పట్టణం, మండల పరిధిలో పలు దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్థానిక జూనియర్ కాలేజీ నూతన భవనం నిర్మించాలని, పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, మాధవపట్నం జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా నూతన ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి నిర్మించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని కోరుతూ ప్లకార్డులు చేత పట్టి సిపిఎం నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం శాఖా కార్యదర్శి కరణం గోవిందరాజు మాట్లాడుతూ మున్సిపాలిటీలోని జనాభాకు అనుగుణంగా తాగునీటిని శుద్ధి చేసే ఫిల్టర్ల స్థాయిని పెంచి అందరికీ తాగునీరు అందించాలని కోరారు. ఎండాకాలంలో రంగు మారిన నీటిని సరఫరా చేయడంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని, తక్షణం ఉన్నతాధికారులు స్పందించి మంచినీటిని అందించాలని కోరారు. సామర్లకోటలోని జూనియర్ కళాశాల శిథిలావస్థలో ఉందని, తేలికపాటి వర్షాలకు క్లాస్ రూములన్నీ తడిసి ముద్ద అవుతున్నాయని, తక్షణం జూనియర్ కళాశాలను నిర్మించాలని, మాధవపట్నం రైల్వే గేట్ వద్ద బ్రిడ్జి నిర్మించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం గ్రీవెన్స్‌లో డిటి కె.పద్మజకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, సిపిఎం నాయకులు బాలం శ్రీనివాస్, కరణం ఏడుకొండలు, ఎస్.యువరాజు, పసుపులేటి వీరబాబు, బాలం హరిబాబు, చరణ్, చల్లా మహేష్ పాల్గొన్నారు.

ఓటమిలోనూ గొప్ప అవకాశం దాగి ఉంటుంది

ప్రజాశక్తి-కాకినాడ

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

ఓటమిలోనూ అది తీసుకువచ్చే నిరాశలోనూ గొప్ప అవకాశం దాగి ఉంటుందని సత్య చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ కాద వెంకటరమణ అన్నారు. సత్య స్కాన్స్ అండ్ డయాగ్నోస్టిక్స్, సత్య చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కాకినాడలోని దంటు కళా క్షేత్రంలో పదో తరగతి విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ కాద వెంకట రమణ మాట్లాడుతూ విద్యలో నాణ్యత, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఏటా తమ సంస్థల తరపున ఉపకార వేతనాలను అందిస్తున్నామని తెలిపారు.కాకినాడ సీ పోర్ట్ ఛీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మురళీధర్ మాట్లాడుతూ సానుకూల దక్పథం, నిబద్ధతతో ఉంటే విజయాలు వాటంతట అవే వస్తాయనడానికి తన జీవితమే ఉదాహరణ అని చెప్పారు. అనంతరం పదవ తరగతి పరీక్షలలో 540 మార్కులు సాధించిన విద్యార్థులకు నిర్వహించిన రాత పరీక్ష ఆధారంగా ప్రతిభ కనపరచిన 70 మందికి సుమారు రూ.3 లక్షలఉపకార వేతనాలను అందజేశారు. డాక్టర్ వై.బాబ్జీ, డాక్టర్ ఆర్ఎన్‌బి.చక్రపాణి, డాక్టర్ రామ్ స్వరూప్ జవహర్, సామాజిక కార్యకర్త అల్లూరి సురేంద్ర, పడాల చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సూర్యప్రసాద్, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు పి. సుబ్బరాజు పాల్గొన్నారు.

మల్లం ఘటనపై సుప్రీంకోర్టులో కేసు

ప్రజాశక్తి-పిఠాపురం

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చెన్న కేశవులు

మల్లం దళితుల బహిష్కరణ ఘటనపై సుప్రీంకోర్టులో కేసు వేశామని, విద్యుత్ షాక్ గురయ్యి మృతి చెందిన పల్లపు సురేష్ కుటుంబన్నీ అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.చెన్నకేశవులు అన్నారు. సోమవారం మల్లం గ్రామాన్ని, సురేష్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామంలో జరిగిన దళితుల బహిష్కరణ విషయంలో అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించకపోవడంతో సుప్రీంకోర్టులో కేసు వేశామన్నారు. బహిష్కరణ కులం పేరుతో జరిగినప్పుడు చట్టప్రకారం చర్యలు తీసుకోన్న తర్వాత మాత్రమే రాజీ వంటి ప్రయత్నాలు చేయాలన్నారు. చట్టపర చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చట్టాలు ధిక్కరించారన్నారు. అధికారులందరినీ సస్పెండ్ చేసి వారందరిపై విచారణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఎద్దు సుబ్రహ్మణ్యం, పి.సూర్య ప్రకాష్, వీరబాబు, వీరేంద్ర కుమార్ తదితరులు ఉన్నారు.

మత సామరస్యం పాటించాలి

ప్రజాశక్తి-పిఠాపురం

మత చాందసతత్త్వం విడనాడి, మత సామరస్యం పాటించాలని శ్రీవిశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా అన్నారు. సోమవారం స్థానిక నూతన ఆశ్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైశాఖ పౌర్ణమి సభలో ఉమర్ అలీషా మాట్లాడుతూ మతాలకు, కులాలకు, జాతులకు అతీతంగా అవతారులు, ప్రవక్తలు, సద్గురువులు ప్రభోదించిన జ్ఞానం, సేవా మార్గం ఆచరిస్తే శాంతియుత సహజీవనం సాగించవచ్చన్నారు. యుద్ధాలు, మారణ హోమాలను నివారించవచ్చన్నారు. అనంతరం పక్షులకు ఆహారంగా ధాన్యపు కుచ్చులు, నిరుపేద మహిళకు కుట్టు మిషన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, ఎన్‌టివి ప్రసాద్ వర్మ, ఎవివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్‌డిఒ కె.శ్రీరమణి తెలిపారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వేదికలో ప్రజల నుండి సమస్యల పరిష్కారం కోరుతూ ఆరు దరఖాస్తులు అందాయి. మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గ్రీవెన్స్‌లో ఆర్‌డిఒ, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఇండస్ట్రియల్ పార్కుకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట

పెద్దాపురం- రాజమండ్రి ఎడిబి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ పార్కుకు మంగళవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, మంత్రి గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేస్తారని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. మంత్రుల జిల్లా పర్యటనలో భాగంగా ఈ శంకుస్థాపన చేస్తారన్నారు. ప్రతి నియోజకవర్గ పరిధిలో పరిశ్రమల అభివృద్ధి, తద్వారా పారిశ్రామికీకరణ, ఎక్కువమందికి ఉపాధి కల్పన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా ఇండస్ట్రియల్ పార్కు అభివద్ధి జరుగుతోందన్నారు.

సామర్లకోట మండలం అచ్చంపేటలో శంకుస్థాపన చేయనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ స్థలాన్ని ఎంఎల్‌ఎ చినరాజప్ప, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ తుమ్మల రామస్వామి సోమవారం పరిశీలించారు. వారి వెంట మాజీ మున్సిపల్ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు, వీరంరెడ్డి పెదబాబు, పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. జగ్గంపేట శ్రీదేవి స్వీట్ స్టాల్ ఆర్థిక సాయంతో నిర్వహించిన ఈ అన్న క్యాంటీన్‌ను టిడిపి మండల అధ్యక్షులు మారిశెట్టి భద్రం ప్రారంభించి పేదలకు ఆహారాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మారిశెట్టి రాధ, దేగల సత్తిబాబు, ఎండి కాజా, మంతెన రఘురామరాజు, కింగం రామకృష్ణ, రామకృష్ణ యాదవ్, పుర్రె వీరబాబు, వానశెట్టి శ్రీను పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 43 అర్జీలు

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో పాడా పీడీ చైత్రవర్షిణి ప్రజల నుంచి వివిధ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వివిధ అంశాలపై 43 అర్జీలు అందాయన్నారు. దీనిలో రెవెన్యూ-20, మున్సిపాలిటీ-10, ఇతరాలు-13 వచ్చాయని ఆమె తెలిపారు. ఈ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఏపీడీ వసంత మాధవి, పిఠాపురం కమిషనర్ కనకారావు, తహశీల్దార్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని శ్రీచక్రస్నానం

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం రత్నగిరిపై కళ్యాణ మహోత్సవాలలో భాగంగా 6వ రోజైన సోమవారం స్వామి, అమ్మవార్లకు శ్రీచక్రస్నానం ఘనంగా నిర్వహించారు. కొండదిగువన పంపాతీరం వద్ద ప్రత్యేక వేదికపై పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం ఛైర్మన్ రాజా ఐవి.రోహిత్, ఇఒ వి.సుబ్బారావు కుటుంబ సభ్యులతో పాటు అర్చకులు, పురోహితులు, యాత్రికులు స్వామి, అమ్మవార్లకు పంపానదిలో త్రిశూలం, శంఖు, చక్రాలతో స్నానం చేయించారు.

గిన్నిస్ రికార్డ్సులోకి తల్లీ కుమారుడు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

సర్టిఫికెట్లు అందుకుంటున్న తల్లీ కుమారులు

ఇంద్రపాలెంకు చెందిన గారా సునీత ఆమె కుమారుడు పి.జోయల్ పాల్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించారని బేతస్థ ప్రెయర్ హౌస్ వ్యవస్థాపకుడు పాస్టర్ రామారావు తెలిపారు. 2024 డిసెంబర్ 1న విజయవాడకు చెందిన హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు అగస్టీన్ దండింగి ఆధ్వర్యంలో సంగీత వాయిద్య ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో 18 దేశాల నుంచి 1,100 మంది సంగీత కళాకారులు పాల్గొని ఆన్‌లైన్‌లో గంటపాటు కీబోర్డుపై గీతాలు ఆలపించారు. గిన్నిస్ బుక్ అధికారులు దీన్ని ప్రపంచ రికార్డుగా గుర్తించారు. గత ఏప్రిల్ 25న విజయవాడలో ఈ గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్‌ను గారీ సునీత, ఆమె కుమారునికి అందించారు.

న్యాయం చేయాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - జగ్గంపేట

మల్లిశాల గ్రామ శివారు సింగరమ్మతల్లి ఆలయ అర్చకురాలు సీతా మహాలక్ష్మి తనకు న్యాయం చేయాలని మంత్రి పవన్ కల్యాణ్‌కు కోరారు. సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులతో కలిసి ఆమె సోమవారం స్థానిక పంచాయ కార్యాలయం వద్ద మీడియా సమావేశంలో మాట్లాడారు. తాము గత 80 ఏళ్ళుగా అమ్మవారికి అర్చకత్వం చేసుకుంటూ అక్కడే కిరణా షాపు నిర్వహించుకుంటూ జీవిస్తున్నామన్నారు. మల్లిశాల గ్రామానికి చెందిన నాయకులు 20 ఏళ్ళుగా మమ్మల్ని ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఐనా మేము వాటిని భరిస్తూ వచ్చామన్నారు. ఐనా వదలకుండా తాము ఉండే ఇంటిని, దుకాణాన్ని టిడిపి నాయకులు ఇటీవల తొలగించారన్నారు. ఈ ఘటనపై గోకవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ దష్టి సారించి న్యాయం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -కరప

స్నేహితుడు మృతి చెందడంతో ఆ కుటుంబానికి పూర్వపు విద్యార్థులు ఆర్థిక సాయం అందజేసారు. కరప గ్రామానికి చెందిన నడిపల్లి వీర వెంకట సత్యనారాయణ కిడ్నీల వ్యాధితో బాధ పడుతూ కొన్ని రోజుల క్రితం మృతి చెందాడు. వైద్యం నిమిత్తం ఆర్థికంగా ఆ కుటుంబం చిదిగిపోయింది. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని పూర్వపు విద్యార్థులు తక్షణ సాయంగా రూ.65,616 సాయం అందించారు. పెద్దిరెడ్డి శ్రీరామకృష్ణ, కోనపురెడ్డి వీర్రాజు, పెంకే సత్తిబాబు, బండారు గాంధీ, కాకర్లపూడి వర్మ, కడియాల వెంకటరమణ, పలివెల శ్రీధర్ పాల్గొన్నారు.

జనరల్ నోటీసు
మహారాజశ్రీ అనకాపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
S.O.P. No. 5/2025

బిట్వీన్: 1.శ్రీమతి యలమంచిలి దుర్గాభవాని
2.శ్రీమతి యలమంచిలి వెంకట పద్మప్రియాంక
3.శ్రీ యలమంచిలి కార్తికేయ నాయుడు ... పిటీషనర్స్
అండ్: నిల్ ... రెస్పాండెంట్స్
ఇండియన్ సెక్సేషన్ యాక్టు సెక్షన్ 372 ప్రకారం
పై నెంబరు పిటిషన్‌లో 1వ పిటిషనరు యొక్క భర్తయున్నూ మరియు 2,3 పిటిషనర్సు యొక్క తండ్రియున్నూ అయిన శ్రీ యలమంచిలి లక్ష్మణరావుగారు, సామర్లకోట రైల్వేస్టేషన్, క్యాటరింగ్ సర్వీసెస్ ప్లాట్‌ఫారం స్టాల్-1ను నిర్వహిన్తూ తే 08-02-2025దిన మరణించియున్నారు. సదరు రైల్వే అథారిటీ / డిపార్టమెంటు వారు నదరు స్టాలు కొనసాగించుకొనుటకు మరణించిన ఆసామీ తరపు వారసులుగా నిర్ణయిస్తూ సక్సేషన్ సర్టిఫికేట్ దాఖలు చేయమని అదేశించి యున్నారు. అంతట సదరు సక్సేషన్ సర్టిఫికెట్టు యిప్పించ గోరి పిటిషనర్సు పై నెంబరు పిటిషన్‌ను కోర్టులో దాఖలు చేసియున్నారు.
కావున, అందును గురించి ఎవరికైనను ఎటువంటి ఆక్షేపణలు వున్న ఎడల అట్టి వారు **ది. 24-6-2025న ఉదయం 10-30లకు** స్వయంగా పై కోర్టులో హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీకోర్టు వారు ప్రస్తుతం వున్న పిటిషనర్ల, వాదనలు పరిశీలించి తగు విధముగా పరిష్కరించదమగునని ఇందుమూలంగా తెలియచేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)
సుంకర శ్రీనివాసరావు ఎమ్.ఎ., ఎమ్.ఎ., బి.ఎల్.
అడ్వకేటు & నోటరీ
వైజయంతి అపార్టుమెంట్, ఉడ్‌పేట,
అనకాపల్లి. సెల్: 98486 14189

పురపాలక సంఘ కార్యాలయము, పిఠాపురం
ఆర్.ఒ.సి. నెం.33/2025-ఇ1 ది.12-05-2025
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
పిఠాపురం పురపాలక సంఘమునకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘ నిధుల నుండి 2 నెం. పనులు రూ. 57.91 లక్షలు మరియు సాధారణ నిధులు నుండి 2 నెం. పనులు రూ. 44.80 లక్షలు వెరసి మొత్తం పనులు 4 నెం. రూ. 102.71 లక్షలకు గాను ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా ఈ క్రింది తెలిపిన సైట్‌లలో టెండర్లు కోరబడుచున్నవి.
మిగిలిన వివరములు https://tender.apeprocurement.gov.in నందు మరియు ఇతర వివరముల కొరకు సెల్ నెం. 9849906523 ద్వారా తెలుసుకొనవచ్చును.
బిడ్డు డాక్యుమెంటు డౌన్ లోడ్ ప్రారంభ తేది : 12-05-2025 సమయం సాయంత్రం గం॥ 5.00
బిడ్డు డాక్యుమెంటు డౌన్ లోడ్ ఆఖరి తేది : 26-05-2025 సమయం సాయంత్రం గం॥ 4.30
సం/- **కమిషనరు,** పిఠాపురం పురపాలక సంఘం

ముమ్మిడివరం నగర పంచాయితీ
ఆర్ఒసి నెం.250/2024/ఇ1 ది.12-05-2025
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్టు టెండరు నోటీసు
ముమ్మిడివరం నగర పంచాయితీ, ఇంజనీరింగు విభాగమునకు సంబంధించి సాధారణ నిధులతో వీధి లైట్ల మెటీరియల్స్ సప్లై చేయు పనికి రూ. 5.00 లక్షల అంచనాలతో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా షార్టు టెండర్లు పిలువబడినవి.
బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేది : 13-05-2025 ఉదయం గం॥ 11.00ల నుండి
బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ఆఖరు తేది : 19-05-2025 సాయంత్రం గం॥ 3.00ల వరకు
బిడ్ డాక్యుమెంట్ తీసుకొనుటకు ఆఖరు తేది : 19-05-2025 సాయంత్రం గం॥ 4.00ల వరకు
మిగిలిన వివరముల కొరకు కార్యాలయ పని వేళలలో ఇంజనీరింగు విభాగము నందు సంప్రదించగలరు.
సం/- **కమిషనరు**
ముమ్మిడివరం నగర పంచాయితీ

గ్రామపంచాయతీ కార్యాలయం, సాకుర్రు
టెండరు ప్రకటన
రి.క. నెం.02/2025 తేది.07-05-2025
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం మండలం, సాకుర్రు గ్రామపంచాయతీ 2025-2026 సంవత్సరమునకు గాను అవసరమగు ఈ దిగువ చూపిన ఐటెం తాలూకు వివిధ విడిభాగములు మరియు మందులు సరఫరా చేయుటకును మరియు వివిధ సేవలు నిమిత్తం సీలు వేసిన టెండర్లు ఈ దిగువ సంతకపు అధికారి వారిచే గాని, వారి అనుమతి పొందిన మరియొకరిచే గాని ది. 19-05-2025వ తేదీ మధ్యాహ్నం గం॥ 12.00లకు వరకు తీసుకొని అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షములో మధ్యాహ్నం గం॥ 12.30లకు సదరు టెండర్లు తెరవబడును. మిగిలిన వివరములు కార్యాలయం పని వేళలలో తెలుసుకొనవచ్చును.

వ.నెం.	వివరములు	ధరావత్తు (రూ.)
1	2025-2026 సంవత్సరమునకు అవసరమగు ప్రజారోగ్య పనిముట్లు, మందులు సరఫరా చేయుటకు	500/-
2	2025-2026 సంవత్సరమునకు అవసరమగు మంచినీటి సరఫరా విడిభాగములు సరఫరా చేయుటకు	500/-
3	2025-2026 సంవత్సరమునకు అవసరమగు స్టేషనరి సామానులు సరఫరా చేయుటకు	500/-

సం/- **గుత్తుల చిరంజీవిరావు**
సర్పంచ్, సాకుర్రు గ్రామపంచాయతి
సం/- **వి.రమా శైలజ**
పంచాయితీ కార్యదర్శి, సాకుర్రు గ్రామపంచాయతి
గమనిక: 1. గ్రామపంచాయితీ నిధులు నిల్వలను అనుసరించి వరుస క్రమములో చెల్లించబడును.
2. గ్రామపంచాయితీనకు సరఫరా చేయబడు సామాన్లు మంచి నాణ్యత కలిగి మార్కు ISI కలిగి యుండవలెను.
3. టెండరును ఆమోదించుట గాని, నిరాకరించుటకు గాని పంచాయితీ వారికి పూర్తి అధికారము కలదు.

డాక్యుమెంట్స్ పడిపోయినవి
జగ్గంపేట మండలం, కాట్రావులపల్లి గ్రామానికి చెందిన కందుల రాజ్యలక్ష్మి, W/o. విజయభాస్కర్ అను నేను తెలియజేయునది ఏమనగా,
నాకు కాట్రావులపల్లి గ్రామంలో సర్వే నెంబర్ డాక్యుమెంట్ నెం. 921/2016 మరియు S.No. 1043/2023 & C.No. 832/2023, Dt. 10-7-2023 జగ్గంపేటలో రిజిస్టర్ కాబడిన 277/3-A-1 లో 0.09 సెంట్లు జిరాయితీ మెరక భూమి కలదు. నా భూమి యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్స్ తీసుకుని కాకినాడ వెళ్ళుచుండగా దివి. 27-4-2025వ తేదీన పెద్దాపురం దర్గా సెంటర్ నందు జిరాక్స్ తీయించుటకు చూసుకొనగా ఎక్కడో పడిపోయినది. దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు అందజేయవలసిందిగా కోరి ప్రార్థించుచున్నాను.
కందుల రాజ్యలక్ష్మి
W/o. గరగ విజయభాస్కర్
డో.నెం. 1-139/2, భవాని నగర్
కొత్తూరు సెంటర్, అచ్చంపేట జంక్షన్, కాకినాడ
సెల్: 9490401634, 9492156653

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) KOTHAPETA
E.P. No. 1/2019 O.S. No. 28/2016
Between:
D.H.R : Karri Sudhakara Reddy
J.D.R : 1. Medapati Uma Varalakshmi (died)
2. Medapati Venkata Reddy
3. Goluguri Venkata Lakshmi
4. satti Lakshmi
5. Medapati Ananda Suryanarayana Reddy
D.H.R. తరపున వేయించిన వేలం ప్రకటన
పై నెంబరు గ్రంథములో E.P. తాలూక JDR కు సంపూర్ణ హక్కు భుక్తములో గల రావులపాలెం గ్రామంలోని యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని పై నెంబరు E.P బాకీ రాబట్టు నిమిత్తం ది. 16-06-2025 సం.రం. తేదీన ఉదయం 10-30 ని॥ల నుండి పై కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయబడునని ఇందుమూలముగా తెలియ చేయడమైనది.
వేలం షెడ్యూలు
Dr. B.R. Ambedkar, Konaseema District, Ravulapalem, Sub. registrar Ravulapalem Village, Residencial site 201.67 Sq. yards in R.S.No. 266/1 (Supplemental S.No. 266/1 B2) bounded on
EAST : Sit of Velagala Meenakshi
SOUTH : Sit of Kovuri Thatha Reddy, Kovuri Musalamma & others
WEST : Sit of Goluguri Venkata Rami Reddy
NORTH : Sit of Goluguri Ramanjaneya Reddy & others
Within the boundaries
D.H.R Value - Rs. 5,00,000/-
Amina Value - Rs. 20,00.000/-
వంగూరి వెంకట సత్యనారాయణ
Dt: 12-05-2025 Advocate for D.H.R
Cell: 92900 73222, 7989146859